

ఓటరుగా దరఖాస్తు చేసుకోండి

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ప్రకారం జిల్లాలోని కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఓటరు చిరునామా మార్పులు, తొలగింపు కోసం నవంబరు 28లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

ఆదోనిని 4 మండలాలుగా విభజించండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే పార్థసారథి వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతిపెద్ద మండలంగా ఉన్న ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని సీఎం చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన అమరావతిలో చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదోని నియోజకవర్గం 44 గ్రామాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద మండలంగా ఉందని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తమ నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. బాగా వెనుకబడిన ఆదోనిలో రహదారులు గుంతలమయమై, కనీస మరమ్మతులు చేసుకోవడానికి కూడా నిధులు లేవన్నారు. ఎలాగైనా ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి రూ.25 నుంచి 30 కోట్ల మేర ఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదల చేయగా, ఆదోని నియోజకవర్గానికి రూ.2 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. తన వినతిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పార్థసారథి వెల్లడించారు.

డీఆర్వో బాధ్యతల స్వీకరణ



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటనారాయణమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆమెను రెవెన్యూ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె వెల్లడించారు.

కుడా డీఈఈగా గోపాలకృష్ణ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు గోపాలకృష్ణమూర్తిని విధుల్లో చేరాలని కుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న గోపాలకృష్ణమూర్తి ఇటీవల ఈఎన్‌సీ ఆఫీసులో రిపోర్టు చేశారు. ఈ నేపథ్యంలో జరిగిన బదిలీల్లో ఆయన కుడాకు బదిలీ అయ్యారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్‌పై సెర్చ్ వారెంట్

కర్నూలు లీగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నిందితుడిని అక్రమంగా నిర్బంధించారన్న ఫిర్యాదు మేరకు స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు సోమవారం సెర్చ్ వారెంటు జారీ చేసింది. స్థానిక బంగారుపేటకు చెందిన లక్ష్మన్న చీటీల వ్యాపారం చేసేవాడు. అయితే అతను మోసం చేశాడని కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో లక్ష్మన్నను పోలీసులు అరెస్టు చేశారు. అయితే పోలీసులు అక్రమంగా నిర్బంధించి కోర్టులో హాజరు పరచలేదని లక్ష్మన్న కుటుంబీకులు కోర్టులో సెర్చ్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు స్పందించి లక్ష్మన్న కోసం సెర్చ్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ మేరకు లక్ష్మన్న కోసం అడ్వకేట్ కమిషనర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అతను అక్కడ లేకపోవడంతో కమిషనర్ వెనుదిరిగారు.

పైసల ప్లానింగ్





కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):
నగర పాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి పెచ్చుమీరిందా.. అక్కడి సిబ్బంది, అధికారుల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందా.. కర్నూలు నగరంలో వెలుస్తున్న అనధికారిక నిర్మాణాలను చూస్తుంటే అవుననే చెప్పాలి. నగరంలో 52 వార్డులు ఉండగా సుమారు ఏడు లక్షల జనాభా ఉంది. ప్రతి నెలా నగర పట్టణ ప్రణాళిక విభాగానికి సుమారు 30 నుంచి 45 వరకు దరఖాస్తులు వస్తుంటాయి. ప్రతి సంవత్సరం నగర పాలక సంస్థకు రూ.40 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అనుమతులు సక్రమంగా తీసుకుంటే ఇంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే కొంత మంది అధికారుల చేతివాటంతో అక్రమ నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. ఫలితంగా నగర పాలక ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

- మామూళ్ల మత్తులో పట్టణ ప్రణాళిక సిబ్బంది
- చూసీచూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు
- విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- నగర పాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి

నోటీసులతో సరిపెడుతూ...

పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతోపాటు 130 మంది సచివాయాల పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఉన్నారు. ఆయా వార్డుల్లో ఎక్కడ నిర్మాణం జరిగినా వారికి తెలిసిపోతుంది. అయినా అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు. కొంతమంది ప్లానింగ్ సెక్రటరీలు తమ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగినా పట్టించుకోవడం లేదు. ఒకవేళ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కొన్ని నెలలుగా నగరంలో విచ్చలవిడిగా అనధికారిక భవనాలు వెలుస్తున్నాయి.

అంతా తానై...

నగరంలోని ఓ వార్డు సచివాలయానికి చెందిన ప్లానింగ్ సెక్రటరీ అంతా తానై వ్యవహరిస్తున్నారు. నగరంలో ఎక్కడ భవన నిర్మాణం జరిగినా వెంటనే అక్కడ వాలిపోతుంటారు. తన సచివాలయ పరిధి కాకపోయినా భవనాల వద్దకు వెళ్లి యజమానులతో మంతనాలు సాగిస్తుంటారు. అనధికారిక భనాల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సెక్రటరీపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. విభాగంలోని కొందరు అధికారులకు మామూళ్లు అందతుండడం వల్లే పట్టించుకోవడం లేదన్న విమర్శలుఉన్నాయి.





అశోక్ నగర్‌లో నిర్మిస్తున్న అనధికార భవనం

మిగతా 6లో..

దీపావళి వసూళ్లు..!

- దుకాణాల అనుమతులు పేరిట ఓ నాయకుడి దందా
- ఒక్కో షాపు నుంచి రూ.40 వేలు డిమాండ్
- తెలిసీ పట్టించుకోని అధికారులు

నంద్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):
దీపావళి అంటే టపాసుల మోతలు.. వాటి కొనేందుకు వెళ్లే వారితో కళకళలాడే దుకాణాలు గుర్తుకొస్తాయి. అయితే ఈ దుకాణాల అనుమతుల పేరిట ప్రతి ఏటా మాదిరి ఈసారి కూడా ఓ నాయకుడు దందాకు తెరతీశాడు. ఒక్కో దుకాణం నుంచి వేలల్లో వసూలు చేస్తూ డబ్బులు దండుకునే పనిలో పడ్డాడు. పండుగ సమయంలో అనుమతుల కోసం అధికారులు సమావేశం నిర్వహించడం ఆలస్యం సదరు నేత రంగంలోకి వచ్చేస్తాడు. అధికారులు అనుమతుల కోసం సొంతంగా వెళ్ల వద్దని, తన ద్వారా వెళితే ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటానని మభ్యపెడుతూ వేల రూపాయలు దండుకుంటున్నాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అయ్యే ఈ నేత తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నేరుగా వెళ్లనివ్వకుండా..

టపాసులు అమ్ముకునే వారి కోసం దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా పట్టణ అధికారులు సమావేశం నిర్వహిస్తారు. అనంతరం దుకాణాల అనుమతుల కోసం దుకాణాదారులు మునిసిపాలిటీ, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధిత శాఖ నుంచి, ప్రకటనలు, తాత్కాలిక దుకాణాల ఏర్పాటు కోసం మునిసిపాలిటీ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి, మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య విభాగానికి చలానాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో ఎక్కడ కూడా మధ్యవర్తితో పనిలేదు. దుకాణాలు ఏర్పాటు చేయదలుచుకున్న వ్యక్తి నేరుగా సంబంధిత శాఖల అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది. కానీ అలా అన్ని పనులు సక్రమంగా జరిగిపోతే తనకు ఏం మిగులుతాయనుకున్నాడో ఏమో ఓ వ్యక్తి దుకాణాల అనుమతుల కోసం తనను సంప్రదించాలంటూ గాలం వేశాడు. అన్ని చలానాలు కలిపి రూ.38 వేలకు చేస్తామని, ఎవరు ఎక్కడకు వెళ్లకూడదని, లేకపోతే ఆ తర్వాత అధికారులతో ఇబ్బందులు వస్తాయని తన అనుచరులతో సుతిమెత్తగా బెదిరించే పనికి పూనుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియా గ్రూపుల్లో కొద్ది రోజుల కిందట తెగ చక్కర్లు కూడా కొట్టింది.

మిగతా 6లో..

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ బిందుమాధవ్
- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 141 అర్జీలు

కర్నూలు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 141 ఫిర్యాదులు వచ్చాయి. శ్రేయాస్ ఇన్‌ఫ్రా మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో రూ.12 కోట్లు కట్టించుకుని 18 నెలలకు రూ.లక్షకు లక్ష ఇస్తామని చెప్పి తమ వద్ద డబ్బులు కాజేశారని కర్నూలు ధనలక్ష్మీ నగర్‌కు చెందిన వెంకట సుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు అజయ్‌జైన్‌కు బంగ్లాదేశ్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసి విరమించుకున్నామని అశోక్‌నగర్‌కు చెందిన నాగశేషి తెలిపారు. అయినా కన్సల్టెన్సీ ప్రతినిధులు తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కర్నూలు షాపింగ్ మాల్స్ వద్ద ఆయుర్వేద మందుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని అరోరానగర్‌కు చెందిన వై.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. తన కుమారుడికి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5లక్షలు తీసుకుని మోసం చేశాడని కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన రాజు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందు మాధవ్

వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి, కృష్ణగిరి మండల వ్యవసాయ అధికారులు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. వీరు ఏడు రోజులైనా అర్జీలు చూడలేదని తెలిపారు. అలాగే ఆదోని ఎంపీడీవోకు దరఖాస్తులు వచ్చి ఐదు రోజులైనా ఓపెన్ చేయలేదని, ఆయనకు కూడా నోటీసులు ఇవ్వాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ఆదోనిలో నీటి సరఫరాకు సంబంధించి వచ్చిన అర్జీ పరిష్కారంలో గడువు దాటడంపై ఆదోని మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 33 అర్జీలు రీఓపెన్ అయ్యాయని, వీటిని పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్‌కు సంబంధించి ఇంకా 28 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటికి ప్రాధాన్యతనిచ్చి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి
- మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ఆదోనిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధికారులు ప్రారంభించారు. నాగేంద్ర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలో మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సీసీఐ కేంద్రం ఇన్‌చార్జి గౌతమ్ రైతులతో కలిసి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై సీసీఐని రంగంలోకి దించిందని తెలిపారు. సీసీఐ రైతుల నుంచి పత్తి మద్దతు ధర క్వింటాలు రూ.7,521కు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సీసీఐకి పత్తి దిగుబడిని విక్రయించుకునేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పత్తి దిగుబడికి తేమ 8% నుంచి 12% మించకూడదని సూచించారు. ఇప్పటికే నాగేంద్ర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమ, ఎస్‌డీబీఎల్, జయంత్ కాటన్స్, ధారశ్రీ, చెన్నకేశవ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమల్లో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ యజమాని లక్ష్మణరావు, అనిల్, సహాయ కార్యదర్శి శాంత కుమార్, సూపర్‌వైజర్లు మోహన్ రెడ్డి, నరేష్, జ్ఞానప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సీసీఐ ఇన్‌చార్జి గౌతమ్

ఆహా ఏమి రుచి..!



- గుట్టపాడు పాలకోవాకు భలే గిరాకీ
- రోజుకు 150 కిలోల అమ్మకం
- 35 ఏళ్లుగా తయారు చేస్తున్న మహబూబ్ బాషా

ఓర్వకల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆ పల్లెకు ఎవరెళ్లినా నోరు తీపి కావాల్సిందే. ఎర్రటి మంటపై ఏకమైన చిక్కటి పాలు, పంచదారను రుచి చూడాల్సిందే. అంతటి ప్రాచుర్యం పొందింది గుట్టపాడు పాలకోవా. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆ పల్లెల్లోని ఓ ఇంటికి రోజూ ఉదయం, సాయంత్రం పాలవ్యాన్లు క్యూ కడుతాయి. వీటి కోసం ఓ మహిళ పొయ్యిలో మంట పెడుతూ గోలంలో వంట కాన్ని కలబోస్తూ కనిపిస్తుంది. సిద్ధమైన పాలకోవాను తూకం వేసి వినియోగదారులకు పంపే పనుల్లో ఆమె భర్త నిమగ్నమై ఉంటారు. 35 ఏళ్ల క్రితం వెలిగించిన పొయ్యి ఇప్పటికీ ఆ కుటుంబంలో వెలుగులు నింపుతూనే ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నోరూ ఊరిస్తూనే ఉంది.

గుట్టపాడు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా ఊరూరా సైకిల్‌పై తిరుగుతూ ఐస్‌క్రీం అమ్మేవారు. సాయంత్రం ఇంటికి రాగానే కారంపొండి దంచి గ్రామస్థులకు అమ్ముకునేవారు. ఇలా చెమటోడ్చి వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించేవాడు. రోజంతా కష్టపడినా అరకొర సంపాదనే. ఈ క్రమంలోనే పాలకోవా తయారీకి ప్రసిద్ధి అయిన తడకనపల్లెలో బంధువుల ఇంటికి అప్పుడప్పుడు వెళ్లేవారు. తాను ఆ దిశగా అడుగులు వేసి అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. ఆ ఆలోచన రాగానే పాలకోవా తయారీ నేర్చుకున్నాడు. 35 ఏళ్ల క్రితం తన ఇంటి వద్ద ప్రత్యేకంగా పొయ్యి ఏర్పాటు చేసుకుని మెల్లగా తయారీ చేయడం ప్రారంభించాడు. రుచికరంగా ఉందన్న పేరు రాగానే వెనుదిరిగి చూసుకోలేదు. ఇప్పుడు రోజుకు 150 కిలోల పాలకోవాను తయారు చేసి విక్రయించే స్థాయికి చేరుకున్నాడు. ఈయనకు చేదోడువాదోడుగా భార్య మహ్మద్ రోషాబీ నిలిచింది. కోవా తయారీ బాధ్యత చూసుకుంటుండగా విక్రయించే వ్యవహారం బాషా చూసుకుంటున్నారు.

రోజుకు 150 కిలోల అమ్మకం

మిఠాయిల్లో పాలకోవాది ప్రత్యేక స్థానం. మిగిలిన వాటితో పోలిస్తే.. ధర కూడా కాస్త ఎక్కువే. అయినా సరే పెళ్లిళ్లు, పేరింటాలు తదితర శుభకార్యాల్లో పాలకొవాను తప్పనిసరిగా వడ్డిస్తుంటారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన రుచికరమైన పాలకోవా ఎక్కడ లభిస్తుందోనని ఆరా తీసి మరీ ఇక్కడికి వచ్చి ఆర్డర్స్ ఇస్తుంటారు. ఈ కారణంగా జిల్లాలో గుట్టపాడు పాలకోవాకు భలే డిమాండ్ పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి ఆర్డర్స్ క్రమం తప్పకుండా వస్తుంటాయి. స్వీట్ స్టాల్స్, బేకరీలు, హోటళ్లకు నిరంతరం సరఫరా చేస్తున్నారు. దీనికి తోడు కిలో, అరకిలో ప్రకారం ఇళ్లకు పాలకోవాను తీసుకెళ్లేందుకు కూడా ఇక్కడికి వస్తుంటారు. రోజుకు 150 కిలోల పాలకోవా అమ్మకం జరుగుతోంది.



కిలో పాలకోవా రూ.200

పాలకోవా వ్యాపారం ప్రారంభించిన తొలి రోజుల్లో రోజుకు 25 కేజీలు తయారు చేసేవారు. ప్రస్తుతం 150 కేజీలు తయారు చేస్తున్నారు. ఇందు కోసం 180 లీటర్ల పాలు, వంద కేజీల పంచదారను వినియోగిస్తున్నారు. కిలో రూ.200 ప్రకారం విక్రయిస్తున్నారు. ఖర్చులన్నీ పోనూ రోజుకు రూ.2 వేలు దాకా మిగులుతుందని బాషా చెబుతున్నారు. ఆయన భార్య రోషాబీ పొదుపు సంఘంలో రుణం తీసుకుని వ్యాపారంలో ఖర్చుకు వినియోగిస్తోంది.

అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం

గుట్టపాడులో గ్రామసభలు జరిగినప్పుడు మహబూబ్ బాషా ఇల్లు రద్దీగా ఉంటుంది. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులకు ఈ పాలకోవా అంటే భలే ఇష్టం. దీంతో రెండు మూడు రోజులకు ముందే మహబూబ్ బాషాకు ఆర్డర్లు ఇస్తారు. గ్రామ సభ ముగియగానే ఒక్కొక్కరు కిలో, రెండు కిలోల చొప్పున తీసుకెళ్తారు. పాలకోవా కోసమే చాలా దూరం నుంచి ఈ గ్రామానికి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా నుంచి 50 నుంచి 60 కిలోల చొప్పున ఆర్డర్స్ వస్తుంటాయి. 10 లేదా 15 రోజుల ముందే ఆర్డర్స్ ఇస్తుంటారు.

పాలకోవా తినాల్సిందే



మా ఇంటికి ఎవరు వచ్చినా పాలకోవా తినాల్సిందే. బంధుమిత్రులు వస్తే.. వెంటనే పాలకోవా తెప్పిస్తాం. మా ఊరి పాలకోవాకు మంచి గిరాకీ ఉంది. ఒకసారి పాలకోవా తిన్నవారు మళ్లీ అడిగి తెప్పించుకుంటారు.

- మోహన్ రెడ్డి, సర్పంచ్ గుట్టపాడు

రుణం ఇస్తే.. మరింత విస్తరింపజేస్తాం



35 ఏళ్లుగా పాలకోవాను తయారు చేస్తున్నాం. నా భార్య మహ్మద్ రోషాబీ, కూతురు రహీమాలు ఇంటి వద్ద పాలకోవా తయారు చేస్తారు. విక్రయించే బాధ్యత నాదే. నంద్యాల, కర్నూలు, బేతంచెర్ల, పాణ్యం, తెలంగాణలోని గద్వాల, ఐజ, గుంతకల్లు, ఎర్రవలి తదితర ప్రాంతాలకు వెళ్లి పాలకోవాను విక్రయిస్తుంటాను. వచ్చిన ఆదాయంతో సొంత ఇల్లు కట్టుకున్నా. నా కుమారుడు మహమ్మద్ బాషా డిప్లమా చేస్తున్నాడు. బ్యాంకు రుణం ఇస్తే వ్యాపారాన్ని మరింత విస్తరిస్తాను.

- మహబూబ్ బాషా, పాలకోవా తయారీదారుడు



పాలకోవా తయారు చేస్తున్న మహమ్మద్ రోషాబీ

కర్నూలు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా కె.వెంకటేశ్వర్లు

ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డా.కె.వెంకటేశ్వర్లును నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కేటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎఫ్‌ఏసీగా ఉన్న డా.సి.ప్రభాకర్ రెడ్డి కార్డియోథొరాసిక్ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు. కొత్త సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు గత 22 సంవత్సరాలుగా కర్నూలు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో పని చేస్తున్నారు. ఆసుపత్రిలో మొట్టమొదటి కీళ్ల మార్పిడీ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి పేరొందారు.

కోరుకొండ సైనిక్ స్కూల్లో విద్యాభ్యాసం

కర్నూలు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన కె.దుబ్బన, కె.లింగమ్మ దంపతులకు ముగ్గురు మగ సంతానంలో చివరి కుమారుడు కెవెంకటేశ్వర్లు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఈయన 1 నుంచి 12వ తరగతి వరకు సైనిక్ స్కూల్ కోరుకొండలో చదివారు. 1985 నుంచి 95 వరకు గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఎంఎస్, ఆర్థో పూర్తి చేసి 1998 కేఎంసీలో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వైద్య వృత్తిలో అడుగు పెట్టారు. 2010లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా రెండేళ్లు వరంగల్‌లో పని చేసి తిరిగి కర్నూలు కేఎంసీకి వచ్చారు. 2015లో ప్రొఫెసర్‌గా 2024 అక్టోబరు 28న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొత్త సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగుల కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తానని, క్యాజువాల్టీ, సూపర్ స్పెషాలిటీ, ఎంసీహెచ్‌లో మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

ఫిర్యాదు చేశారని బెదిరింపులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్లు ఏరివేయాలని ఫిర్యాదు చేసిన వారిపై కొంతమంది బెదిరింపులకు దిగుతున్నారని ఏపీడీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి అన్నారు. 2002లో పారా మెడికల్ ఉద్యోగుల రిక్రూట్‌మెంటు నోటిఫికేషన్ జారీ చేయగా కొంతమంది బోగస్ సర్టిఫికెట్లతో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ఉద్యోగాలు పొందారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి ఏరివేయాలని, ప్రభుత్వ సంస్థల నందు శిక్షణ పొందిన వారికి న్యాయం చేయాలని ఏపీ రాష్ట్ర లోకాయుక్త సంస్థకు బాధితులు ముత్యాల బాలుడు, బీజీవేముల అంకిరెడ్డి ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఉమ్మడి 13 జిల్లాల్లో విద్యార్హత పత్రాల విచారణ నిమిత్తం వచ్చే నెల 5న లోకాయుక్తకు పంపించాలని సర్క్యులర్ జారీ అయిందని వివరించారు. దీంతో బోగస్ సర్టిఫికెట్‌దారులు ఫిర్యాదు చేసిన బాధితులకు ఫోన్ చేసి బెదిరింపు చర్యలకు దిగినట్లు వారు తెలిపారు. వారికి రక్షణ కల్పించాలని ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డితోపాటు రాష్ట్ర ప్రతినిధులు మునిరెడ్డి, చాంద్‌బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇసుక అదనపు ఫీజులు రద్దు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇసుకకు సీనరేజ్ ఫీజు, డీఎంఎఫ్, మెరిట్ కింద మెట్రిక్ టన్నుకు రూ.88 ఉండగా... ఆ ఫీజులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుకను తరలించకుండా రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు పంచాయితీ సెక్రటరీల అనుమతితో సొంత పనులు, గ్రామ అవసరాలు, కమ్యూనిటీ పనుల కోసం యంత్రాలు లేకుండా ఎద్దుల బండ్లు లేదా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, గనుశాఖ డీడీ రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వసూళ్లు..!

5వ పేజీ తరువాయి

వైసీపీ ప్రభుత్వం అండతో గత ఐదేళ్ల సదరు నాయకుడు రెచ్చిపోయాడు. దుకాణాల అనుమతుల విషయంలో తన మాటకు ఎదురు లేకుండా చూసుకున్నాడు. రెండేళ్ల కిందట టపాసులు దుకాణాల అనుమతుల పేరిట డబ్బులు వసూలు చేసి, చివరి రోజు వరకు అనుమతులు తీసుకోలేదు. కనీసం ప్రభుత్వానికి కట్టాల్సిన రుసుము కూడా చెల్లించకుండా మొత్తం తన జేబులో వేసుకుందామని చూశాడు. ఈ విషయం తెలియని దుకాణాదారులు దుకాణాల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. దుకాణాలకు అనుమతులు లేకపోవటంతో అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. అడిగినంత డబ్బులు ముట్టజెప్పిన తర్వాత కూడా తమకు ఈ ఇబ్బంది ఏమిటంటూ.. సదరు నాయకుడి వద్దకు దుకాణాల యజమానులు పరుగెత్తారు. సదరు నాయకుడు తన పరపతిని ఉపయోగించి అప్పటికప్పుడు అధికారులకు చలానా రుసుములు చెల్లించి ఆఖరి నిముషంలో అనుమతుల తీసుకున్నాడు.

అధికారులు అడ్డుకట్ట వేయాలి



దీపావళి దుకాణాల అనుమతి పేరిట కొంతమంది వ్యక్తులు ప్రతి ఏటా దందాలు కొనసాగిస్తున్నారు. వీరు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ వైపు ఉంటూ తమ పబ్బం గడుపుకుంటారు. ఎక్కువ డబ్బులు ముట్టజెప్పే దుకాణాదారులు వాటిని తిరిగి సంపాదించేందుకు ఎక్కువ ధరలకు టపాసులు అమ్మాల్సి వస్తుంది. ఇది పండుగ చేసుకోవాలనుకునే వారిపైన భారమే అవుతుంది. దందాలు చేసే వారికి అధికారుల అడ్డుకట్ట వేయాలి.

- బాబా ఫక్రుద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి, నంద్యాల



అధికారుల నిర్లక్ష్యం..

దుకాణాల అనుమతులు విషయంలోనే కాకుండా దుకాణాల ఏర్పాటు విషయంలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టపాసులు దుకాణాల ఏర్పాటు చేసేముందు అధికారులు యజమానుల నుంచి ఫారం - 5 దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఎవరు దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారో వారే అనుమతుల కోసం సంప్రదించాల్సి ఉంటుంది. కానీ ఒకే వ్యక్తి ద్వారా అనుమతులు వస్తున్నా, ఇదేమిటని సంబంధిత అధికారులు అడగకపోవడం గమనార్హం. ఇక దుకాణాల ఏర్పాటు విషయంలో కూడా ఓ పద్ధతిని అధికారులు పాటిస్తున్నట్లు కనిపించటం లేదు. సాధారణంగా టపాసుల దుకాణాలను ఇంగ్లీషు అక్షరం 'ఎల్' మాదిరి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక దుకాణాలను ఒకే మైదానంలో 50కు మించి ఏర్పాటు చేయకూడదు. కానీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కలాశాలో దాదాపు 76 దుకాణాలను ఏర్పాటు చేయడమే కాకుండా, దీర్ఘ చతురస్రాకారంలో ఏర్పాటు చేస్తున్నారు.

పోలీసుల రక్తదానం

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నంద్యాలలో పోలీసులు రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్, రక్తదాన శిబిరాల్లో పలువురు పోలీసులు రక్తదానం చేయగా, బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలకు, కళ్లు, ఎముకలు, స్త్రీ సంబంధిత సమస్యలు, సాధారణ జబ్బులకు వైద్య సేవలు అందించారు. ముందుగా ఎస్పీ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో దాదాపు 154 మంది పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాల సభ్యులు పాల్గొని వైద్యసేవలు పొందారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్లలో రక్తదాన, వైద్యశిబిరాలు నిర్వహిస్తామని ఎస్పీ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 167మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ బృందం దస్తగిరి, ఉస్మాన్‌బాష, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, టెక్నీషియన్ మల్లికార్జున,దామోదర్, ఇర్ఫాన్‌ల సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, శాంతిరామ్ ఆస్పత్రి వైద్యులు అరుణ, ఉదయ్‌మోహన్, సుధాకర్‌రెడ్డి, గౌతమి, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

అది ర్యాగింగ్ కాదు..!

- సీనియర్లు సలహా ఇచ్చారంతే
- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ



కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో జూనియర్లకు సీనియర్లు సలహా మాత్రమే ఇచ్చారని, అది ర్యాగింగ్ ఎంతమాత్రం కాదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ర్యాగింగ్‌పై పత్రికల్లో వచ్చిన కథనాలపై యాంటి ర్యాగింగ్ కమిటీతో విచారణ జరిపించి ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఎన్ఎంసీకి నివేదిక పంపినట్లు వెల్లడించారు. కాలేజీలో ఉన్న 242 మంది ఫ్రెషర్లను వేరువేరుగా మాట్లాడి లిఖిత పూర్వకంగా అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉందని తెలిపారని వివరించారు. తమ విచారణలో క్లాసులకు షూ వేసుకుని వెళ్లాలని, నీట్‌గా షేవ్ చేసుకోవాలని స్టడీ పర్పస్ రిఫరెన్స్ కోసం స్టడీ యాప్‌లను సీనియర్లు సూచించారని చెప్పారు. ఏదైనా సంఘటన జరిగితే సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

తిరుపతి నుంచి సీఆర్ రీడర్ కర్నూలుకు..

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి చొరవతో తిరుపతి ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా ఉన్న ఫ్యూజీ సీఆర్ రీడర్ కర్నూలుకు చేరింది. తిరుపతిలో ఉన్న సీఆర్ రీడర్ అదనంగా ఉన్నట్లు సమాచారం తెలుసుకుని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇక్కడి రోగుల రద్దీని తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు తెలియజేశారు. రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సీఆర్ రీడర్‌ను కర్నూలు జీజీహెచ్‌కు కేటాయించాలని పలుమార్లు లేఖలు రాశారు. ఇందుకు స్పందించిన తిరుపతి ఆసుపత్రి సూపరింటెండెంట్ మిషన్‌ను కర్నూలుకు పంపించారు. దీంతో కర్నూలు జీజీహెచ్ రేడియాలజీ విభాగంలో సోమవారం సీఆర్ రీడర్ ప్రింటర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ యంత్రం ద్వారా రోగులకు ఎక్స్‌రే ఫిల్మ్ ప్రింట్లు త్వరగా ఇవ్వడం జరుగుతుందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, డిప్యూటీ సివిల్ సర్జన్ వెంకటరమణ, చీఫ్ రేడియోగ్రాఫర్ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.




సీఆర్ రీడర్ సేవలను ప్రారంభిస్తున్న డా.హరినాథ్

పైసల ప్లానింగ్

(5వ పేజీ తరువాయి)

నిత్యం పట్టణ ప్రణాళికా విభాగం పని తీరుపై ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వస్తూనే ఉంటాయి. పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య భవనాలకు సంబంధించి స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. సెట్‌బాక్స్ లేకుండా నిర్మిస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవేళ స్పందించినా హడావుడి చేసి పనులు నిలిపివేస్తారు. నెల రోజుల తరువాత మళ్లీ అక్రమాలు కొనసాగుతున్నా పట్టించుకోరు. అక్రమ నిర్మాణాలపై విజిలెన్సు అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యం..

ఎన్నికల సమయంలో నగర పాలక ఉన్నతాధికారి రిటర్నింగ్ అధికారిగా పని చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాదాపు రెండు నెలలుగా అధికారి బిజి బిజీగా ఉన్నారు. అంతే ఇదే అదునుగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది అక్రమ ఆదాయానికి తెర లేపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా స్ట్రక్చరల్ ఇంజనీర్, ప్లానింగ్ సెక్రటరీల అవినీతి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ చేయాల్సిన ప్లానింగ్ సెక్రటరీ, చైన్‌మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అదనపు ఫ్లోర్‌కు, అనుమతి లేని నిర్మాణాలకు రూ.2 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. ముడుపులు ఇస్తే నిర్మాణాలను సజావుగా సాగనిస్తారు. లేదంటే ఏదో ఒక రకంగా కొర్రిపెట్టి ఆపేస్తారు. సెక్రటరీల సంపూర్ణ సహకారం ఉండటంతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అక్రమ సంపాదనకు తెరలేపారన్న ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని అనధికార భవనాలు

- నగరంలోని కేవీఆర్ గార్డెన్‌లో అనధికారిక నిర్మాణాలు చేపట్టారు. ప్లాన్‌లో ఒక రకంగా చూపి మరో విధంగా పనులు చేశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నోటీసులు మాత్రమే ఇచ్చారు. దీంతో భవన యజమాని నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సైతం అక్రమ నిర్మాణాలు చేశారని, ఆ యజమాని నుంచి కూడా డబ్బులు వసూలు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.
- మద్దూర్ నగర్ మెయిన్ రోడ్డులో ఓ వాణిజ్య భవనం నిర్మిస్తున్నారు. నాలుగు ఫ్లోర్లలో నిర్మిస్తున్నా ఈ నిర్మాణానికి ఎలాంటి సెట్‌బ్యాక్స్ వదల్లేదు. మూడు వైపులా స్థలం వదలాలి. ఇక అదనంగా ఫ్లోర్లు కడుతున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- కృష్ణా నగర్‌లో సెల్లార్ లేకుండానే ఐదు ఫ్లోర్లలో నిర్మాణం చేపడుతున్నారు. ఇదే దారిలో అదనంగా అనుమతులు లేకుండా ఫ్లోర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.
- అశోక్ నగర్‌లో సెట్‌బ్యాక్స్ లేకుండా కేవలం ఐదు సెంట్లలో నాలుగు అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. యజమాని చుట్టుపక్కల వాళ్లకి ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్మాణం చేపట్టాలి. అయితే ఎలాంటి నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎవరైనా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం. కార్యదర్శులపై వివిధ ఆరోపణలు వస్తున్నాయి. విచారణ చేయించి సంబంధిత కార్యదర్శిపై చర్యలకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రణాళికా విభాగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలి.

-సి.ప్రదీప్‌కుమార్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి


విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను సోమవారం నుంచి నవంబరు 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణలో భాగంగా సమగ్రత, అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు కల్చర్ ఆఫ్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీ అనే థీమ్‌తో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పబ్లిక్‌లో అవినీతి నిర్మూలనపై క్విజ్ పోటీలు, వాక్‌థాన్‌లు, మారథాన్‌లు, వీధి నాటకాలు, గ్రామసభలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా వీటి గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైలెంట్ కిల్లర్..!

- బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌తో పక్షవాతం
- ఏటా 18 లక్షల మందికి స్ట్రోక్
- నిమిషానికి ఇద్దరికి చొప్పున బాధితులు
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవనశైలిలో అనేక రకాల వ్యాధులు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా గుండె, బ్రెయిన్‌కు సంబంధిత వ్యాధులతో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. ఇప్పుడున్న రోజుల్లో చాలా మంది బిజీ లైఫ్‌లో ఆరోగ్యంపై సరైన దృష్టి సారించడం లేదు. దేశంలో గుండెపోటు తర్వాత ఎక్కువ మందిని బలికొంటున్న వ్యాధి పక్షవాతం. ఒక్కసారిగా మనిషిని కుప్పకూల్చే మహమ్మారి కేసులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌తో పాటు మారిన ఆహారపు అలవాట్లు జీవన విధానం బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సమస్యల్లో అత్యధికంగా మరణిస్తున్న వ్యాధుల్లో గుండెజబ్బులు ప్రథమ స్థానంలో ఉండగా.. ఆ తర్వాత క్యాన్సర్ రెండో స్థానంలో ఉంది. గడిచిన 10 సంవత్సరాలుగా క్యాన్సర్ స్థానంలో బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధులు రెండో స్థానంలో చేరుకున్నాయి. ప్రతి నిమిషానికి ఇద్దరు చొప్పున బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఏటా దేశంలో 18 లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మరణించడం, అంగవైకల్యం పొందడం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడే వారి సంఖ్య పెరుగుతుండటంపై ఈ వ్యాధి నిరోధించడానికి ప్రతి సంవత్సరం అక్టోబరు 29న వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే నిర్వహిస్తున్నారు.

ప్రతి నలుగురిలో ఒకరు



25 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి నలుగురిలో ఒకరికి తమ జీవన కాలంలో బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. స్ట్రోక్ వచ్చిన మొదటి గంట అంటే 60 నిమిషాల్లో ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందిలా చేస్తే ప్రాణాపాయం తప్పినట్లే. స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన మొదటి గంటలోపు కనీసం నాలుగున్నర గంటల్లోపు ఆసుపత్రిలో చేరాలి. ముఖ్యంగా పని ఒత్తిడి, స్మోకింగ్ మద్యపానం అలవాటు వల్ల స్ట్రోక్‌కు గురవుతున్నారు. **- డాక్టర్ ఎం.నాగసురేష్, న్యూరోఫిజీషియన్, కర్నూలు మెడికల్ హాస్పిటల్**

జీజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాష్ట్రంలోనే తొలిసారిగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో 2024 ఫిబ్రవరి 20న న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (స్ట్రోక్ ఐసీయు)ను అప్పటి కలెక్టర్ సృజన, సూపరిం టెండెంట్ జి.వెంకట రంగారెడ్డి ప్రారంభించారు. 10 పడకలతో బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు 24/7 సేవలు అందించేందుకు వీలుగా చిన్నపిల్లల విభాగం లోని రెండో అంతస్థులో ఏర్పాటు చేశారు. స్ట్రోక్ ఐసీయూ రావడంతో రోగులకు క్యాజువాల్టీ, ఏఎంసీలో కాకుండా స్ట్రోక్ యూనిట్ పెట్టి న్యూరాలజి విభాగపు వైద్యులు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ప్రతి ఏడాది 1000 మంది బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు చికిత్స చేస్తున్నారు.



పెద్దాసుపత్రిలోని స్ట్రోక్ ఐసీయూ యూనిట్

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మంది బాధితులు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 లక్షల జనాభా ఉంది. మొత్తం జనాభాలో 5 లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉన్న నెట్‌వర్క్ హాస్పిటల్‌లో కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స ఉంది.


ఎలా గుర్తించాలి

- ఒక వైపు చేయి.. కాలు పని చేయకపోవడం ఫలితంగా నడవడానికి ఇబ్బంది పడటం.
- అకస్మాత్తుగా తల తిరగడం, శరీరంలో బ్యాలెన్స్ కోల్పోవడం.
- మూతి ఒక వైపునకు వంకరగా పోవడం.
- మాట తడపడటం..సరిగ్గా మాట్లాడలేకపోవడం.
- సడెన్‌గా చూపు సరిగ్గా కనపడకపోవడం.
- తీవ్రమైన తలనొప్పి, వాంతులు కావడం, స్పృహ కోల్పోవడం.

స్ట్రోక్‌కు కారణాలు

- దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్ నియంత్రణలో లేకపోవడం.
- ధూమపానం చేయడం, మద్యం అతిగా సేవించడం
- స్థూలకాయం కారణంగా ఒంట్లో కొవ్వు స్థాయి పెరిగిపోవడం
- గుండె జబ్బులకు మందులు సరిగ్గా వాడకపోవడం, కొంత మందిలో పుట్టుకతోనే జన్యుపరమైన లోపాలు ఉండడం.

20 నుంచి 30 శాతం స్ట్రోక్ కేసులు



కర్నూలు జీజీహెచ్‌లో వారంలో ప్రతి సోమవారం గురువారం ఓపీ ఉంటుంది. వారంలో ఓపీకి 500 నుంచి 600 మంది రోగులు వస్తుంటారు. వీరిలో 20 నుంచి 30 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు వస్తున్నారు. బ్లడ్ క్లాట్ అయిన కేసుల్లో 89 శాతం ఉండగా. 20 శాతం బ్లీడింగ్ కేసులు ఉంటాయి. బీపీ, షుగర్, స్మోకింగ్, ఆల్కహాల్, వ్యాయామం లేకపోవడం, ఒబెసిటీ వల్ల పక్షవాతం కేసులు వచ్చే అవకాశం ఉంది. కర్నూలు జీజీహెచ్ స్ట్రోక్ ఐసీయూలో 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో రోగులకు సేవలు చేస్తున్నారు. **- డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్**

స్ట్రోక్‌ను త్వరగా నిర్ధారించాలి



స్ట్రోక్ అనేది అత్యవసర పరిస్థితి. రోగ నిర్ధారణ వేగం పెంచాలి. సిటీ స్కాన్, ఎంఆర్ఐ బ్రెయిన్ వంటి పరీక్షలు చేయించాలి. స్ట్రోక్ వచ్చిన మొదటి 4 నుంచి 5 గంటల అత్యంత కీలకం స్ట్రోక్. చికిత్స తీసుకో వడం కంటే జాగ్రత్త పడటం మంచిది. కూరగా యలు, పండ్లు, ఎక్కువగా తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించాలి. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలి. **- డాక్టర్ చల్లపల్లి బాబురావు, న్యూరాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్**

సమస్యలను పరిష్కరిస్తాం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన వినతులను పూర్తి స్థాయి విచారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 115 వినతులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులక్కు సూచించారు. ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అన్నారు. సోమవారం అందిన వినతుల్లో ఎక్కువగా కుటుంబకలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు సమీప పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, డీఎస్పీ ఆఫీసుల్లో వినతులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలి

- సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి


డ్రోన్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి తంగమణి, ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గీత అధ్యక్షతన జోనల్ సైన్స్‌ఫేర్‌ను సోమవారం సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల చదువులు ఉండాలని అన్నారు. ఉన్నతమైన ఆశయంతో అడుగులు వేయాలని సూచించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ విద్యార్థినుల్లో మేధోసంపత్తిని పెంపొందించేందుకు సైన్స్‌ఫైర్‌లు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థినులు తమ పరిజ్ఞానంతో తయారు చేసిన ప్రదర్శనలు వారి లోని ప్రతిభను తెలియజేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తు అంతా సైన్స్ మీదనే ఆధారపడి ఉంటుందని, అందుకు అనుగుణంగా పరిజ్ఞానాన్ని పెంపొం దించుకోవాలని సూచించారు. డీసీవో శ్రీదేవి మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినుల్లో సృజనాత్మకత, మేధోసంపత్తిని పెంచేలా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అనంతపురం డీసీవో ఉదయ శ్రీ, సీఐలు ఇంతి యాజ్ బాషా, రాకేష్, ఎస్ఐ మమత, డీసీఎం ఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, రామిరెడ్డి, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థినులు

పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన జోనల్ సైన్స్‌ఫేర్‌కు కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన గురుకుల పాఠశాలల విద్యార్థినులు తరలి వచ్చారు. మొత్తం 73 పాఠశాలల విద్యార్థినులు సైన్స్‌ఫేర్‌లో పాల్గొని తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. వెల్దుర్తి గురుకుల పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన డ్రోన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. డ్రోన్ పరికరాలను తయారు చేసిన విద్యార్థినులు, ఉపాధ్యాయులను న్యాయాధికారి తంగమణి అభినందించారు. అదేవిధంగా వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు తీసుకువచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

హమ్మయ్యా.. సర్వర్ పని చేస్తోంది..!

- ఊపిరి పీల్చుకున్న అధికారులు, రైతులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఈనామ్ సర్వర్ పని చేయడం మొదలు పెట్టింది. దీంతో మార్కెట్ యార్డు అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఉల్లి ఉత్పత్తుల విక్రయాలు ఇక చకచకా సాగిస్తామని, రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కర్నూలు మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఉల్లితోపాటు వేరుశనగ, మొక్కజొన్న, ఆముదాలు, సద్దలు, కొర్రలు, తదితర పంట ఉత్పత్తులన్నీ విక్రయించేందుకు సమస్య తొలగిపోయినట్లేనని సెక్రటరీ స్పష్టం చేశారు.

సచివాలయంలో సభ్యత్వ నమోదు తప్పు

- ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సభ్యత్వం నమోదు తప్పు అని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదోని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకు రాలు గుడిసె కృష్ణమ్మ అనుచరగణంతో ఆదివా రం ఆదోని మండలం బైచిగేరి సచివాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో సభ్యత్వ నమోదు అనే శీర్షికను ప్రచురించిన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో స్పందించి సచివాలయ కార్యదర్శి, సిబ్బందిని విచారించి నివేదిక ఇవ్వాలని కోరారు. ఇలా పార్టీలకు సంబంధించిన నాయకులు పార్టీ కార్యకలా పాలను ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడం తప్పన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవడంతోపాటు అన్ని సచివాలయాల ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.


బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

వ్యవసాయ బుక్‌లెట్ల ఆవిష్కరణ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ బుక్‌లెట్స్‌ను కలెక్టర్ రంజిత్ బాషా ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన బుక్‌లెట్స్‌ను ఆవిష్కరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల సాంకేతిక పరిజ్ఞానాన్ని, సమాచారాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. సాధికార సంస్థ హ్యాండ్‌బుక్‌లెట్లు, ప్యాకెట్ బుక్‌లెట్లను ప్రచురించారని అన్నారు. ఇవి జిల్లాలోని 25 మండలాల్లో గల 141 రైతుసేవా కేంద్రాలు, 247 గ్రామ ఐక్య సంఘాల్లోని మహిళా రైతులకు అందేలా చూడాలని సూచించారు. జేసీ నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన గోవిందప్ప, ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన బోయ దేవేంద్రలను ఇస్నీ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ద్విచక్ర వాహనాల్లో మద్యం తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లను, రెండు కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

వైద్యుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎంపీ డా. బైరెడ్డి శబరి


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ శబరి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీ డా. బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నంద్యాల మధుమణి సమావేశ భవనంలో నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ డా.బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్యులపై దాడులు దారుణమన్నారు. వైద్యుల రక్షణ చట్టాన్ని బలోపేతం చేయడానికి, కేంద్రస్థాయిలో వైద్యుల రక్షణ చట్టం తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ మధుసూదనరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. డాక్టర్ రవిక్రిష్ణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి ఎంపీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వైద్యులు అందరూ కలిసి ఎంపీ శబరిని సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన వాహనం

ఆస్పరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిగిలి గ్రామ బస్టాప్ సమీపంలోని మలుపు వద్ద పత్తి లోడుతో వెళ్తున్న బొలెరో, స్కూటర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వీరేష్, గోవర్ధన్, మల్లిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. బాధితుల బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పంటకు తెగులు... రైతుకు దిగులు



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

- అధిక వర్షాలతో తెగుళ్ల బారిన కంది
- ఖర్చు అధికమవుతుందని రైతుల ఆవేదన

మద్దికెర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఖరీఫ్‌లో దాదాపు ఐదువేల ఎకరాల్లో కంది సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉంది. అయితే పంటకు ఆకుపచ్చ పురుగు, మరకమచ్చ తెగుళ్ల ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, ఎడవలి గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట తెగుళ్ల బారిన పడింది. తెగుళ్ల దాడితో పూత, పిందెలు దెబ్బతింటున్నాయి. దీంతో పంటకు ఎరువులు, మందులతో పాటు తెగుళ్లకు అదనంగా మందులను పిచికారీ చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుండటంతో పెట్టుబడి అధికమవుతుందని రైతులు అంటున్నారు.

తెగుళ్ల నివారణకు సలహాలు తీసుకోవాలి

అధిక వర్షాలతో కంది పంటకు సోకిన తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఏవో రవి సూచించారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కందిలో ఆకుపచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 2 ఎంఎల్ ఫినాల్‌ఫాస్, ఫ్లోరోపైర్ పాస్‌మందులు పిచికారీ చేయాలి. మరకమచ్చ పురుగు నివారణకు లీటరు నీటికి ఒక ఎంఎల్ నోవాలిరన్ మందు పిచికారా చేయాలని సూచించారు.

తెగుళ్లతో నష్టపోతున్నాం



తెగుళ్లు సోకి నష్టపోతున్నాం. మందులతో పాటు అదనంగా తెగుళ్ల నివారణకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. **- రాము యాదవ్, పెరవలి, రైతు**

ఈ ఏడాది కంది సాగు చేశా



వేరుశనగ సాగుతో నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది ఐదెకరాల్లో కంది సాగుచేశా. తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.**- రామాంజులు, మద్దికెర, రైతు**

సభ్యత్వం తీసుకుంటే పార్టీ అండ

టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



తుగ్గలిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వం తీసుకుంటే టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి అన్నారు. సోమవారం తుగ్గలి, మారెళ్లలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మాజీ ఎంపీటీసీ వెంకట్రాముడు గౌడ్, రామచంద్ర, వెంకట్రాముడు, రామయ్య, నల్లగుండ్ల రవి, సర్పంచ్ రవి పాల్గొన్నారు.

'75 వేలు దాటిన బీజేపీ సభ్యత్వం'

ఆదోని టౌన్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లాలో 75 వేలు దాటిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సోమవారం తెలిపారు. దేశంలో మోడీ పాలన అవసరమని భావించేవారు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవడంతో సంతోషంగా ఉంద న్నారు. దేశంలో ఏడు కోట్ల మంది సభ్యులతో అతిపెద్ద పార్టీగా బీజేపీ చేరుకోవడం గర్వకారణం అని అన్నారు. రానున్న జిల్లా పార్టీ సంస్థాగత ఎన్నికలకు గీతా మాధురి (కర్నూలు), దేశాయ్ చంద్రన్న (ఆదోని) లను అదనపు ఎన్నికల ఇన్‌చార్జిలుగా నియమించడం జరిగిందని తెలిపారు.

పత్తి ధర మరింత పతనం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు మరింత పతనమయ్యాయి. మంగళవారం గరిష్ఠంగా పత్తి క్వింటాలు రూ.7,220కు పడిపోయింది.. ధరలు పతనం కావడంతో పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులోనే క్వింటానికి రూ.600పైగా తగ్గడంతో రైతులు మరింత కుమిలిపోతున్నారు. పెట్టుబడి కూడా అదేలా లేదని ఆవేదన చెందుతున్నారు. 7791 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠధర రూ.4211, గరిష్ఠంగా రూ.7220, మధ్యస్థ ధర రూ.6889 పలికింది.

వలంటీర్లను కొనసాగించాలి



పత్తికొండలో ధర్నా చేస్తున్న వలంటీర్లు

పత్తికొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి హనుమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి ఏఐవైఎఫ్ వాలంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు రవి, లలిత, రజిని, షాజీర్, ఏఐవైఎఫ్ నాయకులు వినోద్, చిరంజీవి, రంగనాథ్, వెంకట్రాముడు, విజయ్, ఆల్తాఫ్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ రామకృష్ణ రాక

పత్తికొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయర్, హంద్రీనీవా ప్రధాన కాలువ పరిశీలనకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళ వారం పత్తికొండకు వస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి రాజాసాహెబ్ తెలిపారు. పందికోన రిజర్వాయర్, ప్రధాన కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయనీ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సీపీఐ బృందం పర్యటన చేపట్టిందన్నారు కార్యదర్శి వర్గసభ్యులు రామచంద్రయ్య, జగదీష్, కార్యదర్శి గిడ్డయ్య పాల్గొంటారన్నారు.

నిధులు ఇవ్వాలి

మద్దికెర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కొండయ్యతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎం.అగ్రహారంలో సీసీ రహదారులకు రూ.30 లక్షలు మంజూరు చేసిందని, రూ.5 లక్షల మండల నిధులు ఇస్తే మరింత అభివృద్ధి చేసే అవకాశముందన్నారు. స్పందించిన ఎంపీడీవో పాలకవర్గంతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు.

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు రూ.3480 కోట్లు పెండింగ్ ఉందన్నారు. ఫీజులను చెల్లించాలని కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గౌస్, శశిధర్, భరత్, సంజయ్, లోకేష్, ఉచ్చిరప్ప, రవితేజ, ఫరీద్ భాషా పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు

టీడీపీకి పునాది కార్యకర్తలే

ఆదోని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పునాది కార్యకర్తలు అని, ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. సోమవారం ఆదోని నియోజకవర్గంలోని అలసందగుత్తి, విరుపాపురం గ్రామాల్లో టీడీపీ సభ్యత్వం నమోదు నిర్వహించారు. ఆదోని నియోజకవర్గంలో అధిక సంఖ్యలో సభ్యత్వం నమోదు చేయించి రికార్డు సృష్టిద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ పార్టీ అంటే క్రమశిక్షణ గల పార్టీ అని పార్టీలో సభ్యత్వం ఉన్న నాయకులను, కార్యకర్తలను కాపాడుకోవడం చంద్రబాబు బాధ్యత అని అన్నారు. నాయకులకు కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, అందుబాటులో ఉంటారన్నారు. సభ్యత్వం ఉంటే రూ.5లక్షల బీమా సహజ మరణం పొందితే 10వేలు మట్టి ఖర్చులకు, పేద విద్యార్థులకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రామస్వామి, ఉరుకుంద రెడ్డి, వీర, సోమేశ్వర్, రవి, కృష్ణ, కాసిం, సోమనాథ్, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలి



ఆలూరులో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆలూరు, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గంటపాటు నిరసన తెలిపారు. నాయకులు మారుతి గోవర్ధన్, డీవైఎఫ్ఐ నాయకులు షైన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భోజన పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందించారు.

మద్దికెర: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కడవల రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఇచ్చిన హామీ మేఉకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. తరుణ్, వేణు, అనిల్, ప్రకాష్ ఉన్నారు.



ఆస్పరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

పార్టీని బలోపేతం చేద్దాం

ఆస్పరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దామని ఆలూరు ఎమెల్యే విరుపాక్షి పిలుపునిచ్చారు. సోమవారం రామతీర్థ క్షేత్రంలో గ్రామస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గ్రామ కమిటీలను ఎంపిక చేసి ఆ కమిటీల ద్వారా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని అన్నారు. జడ్పీటీసీ దొరబాబు సర్పంచులు హరికృష్ణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర భరద్వాజ్

ఆదోని, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): అధికారుల దృష్టికి వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రివెన్స్ అడ్రసింగ్ సిస్టెమ్-పీజీఆర్ఎస్‌లో డివిజన్‌లోని మండలాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ, గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్సెల్యేలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల సమస్యలు కొన్ని..

ఆదోని మండలం ధణాపురం గ్రామంలో సర్వే నెం. 191,191-3 పట్టా భూమిని ఆన్‌లైన్‌లో ఈనామ్ గా నమోదు అయిందని, విచారణ చేసి పట్టా భూములుగా నమోదు చేయాలని గ్రామానికి చెందిన హనుమేష్ అర్జీ సమర్పించుకున్నారు

ఆదోని మండలం నెట్టేకల్లు గ్రామంలో ప్రభుత్వ రోడ్డు స్థలం ఆక్రమణ చేసుకుని మరుగుదొడ్డి నిర్మాణం చేసుకున్నారు. ప్రస్తుతం సదరు స్థలం నందు రస్తాకు సమస్య అయినది. దయతో విచారణ చేసి సమస్యను పరిష్కరించవలసిందిగా నెట్టేకల్లు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అర్జీ సమర్పించుకున్నారు.

పెద్దకడుబూరు మండలం హెచ్ మురవణి గ్రామానికి చెందిన గడిగె బజారుకి సంబంధించి సర్వే నెం. 422-ఏ నందు 0.92 సెంట్ల భూమి, సర్వే నెం. 434 నందు 1.40 ఎకరాల మరియు, సర్వే నెం. 634-ఏ నందు 0.80 సెంట్ల భూమి మొత్తం కలిపి 3.64 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించింది. సదరు భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించుకున్నారు. అలాగే ఎమ్మిగనూరు మండల గుడెకల్లు గ్రామానికి చెందిన కృష్ణయ్య గ్రామం సర్వే నెం. 219 నందు 0.14 సెంట్ల భూమి వారసత్వంగా సంక్రమించినది. సదరు భూమికి సంబంధించి సర్వే చేసి, ఆన్‌లైన్ నందు నమోదు చేసి, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు. సర్వేయర్ శ్రీనివాస రాజు, వేణుసూర్య, డీఎల్‌డీపీవో నూర్జహాన్, డీఎల్‌డీవో ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, హౌసింగ్ డీఈ రవికుమార్, ఆర్&బి డిప్యూటి ఇంజనీర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ రద్దుపై విచారణ చేయాలి

ఆదోని టౌన్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌లేబర్ కాలనీ మునిసిపల్ స్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ రద్దుకు కారకులపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని బీజేపీ యువ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు నాగరాజ్, లక్ష్మన్న మాట్లాడుతూ, ఎన్‌సీసీ యూనిఫామ్ కోసం ప్రభుత్వం విద్యార్థుల ఖాతాలో రూ.3,800 నగదును జమ చేసిందని, అయితే ఎన్‌సీసీ యూనిట్ ఉపాధ్యాయుడు శిక్షణ పూర్తి చేయకపోవడంతో ఎన్‌సీసీ యూనిట్ రద్దు చేశారన్నారు. కిరణ్, నరసింహారాజు, పాల్గొన్నారు.

ఎన్‌సీసీ డబ్బు వాడుకోలేదు..

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ క్యాడేట్లకు యూనిఫారం కోసం జమ అయిన డబ్బును వాడుకున్నామన్న ఆరోపణలు అవాస్తవమని, ఆర్ఆర్ లేబర్ కాలని పురపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్ నాయుడు తెలిపారు. సోమవారం మాట్లాడుతూ 2020-21 నుంచి 2024 జనవరి వరకు ఎన్‌సీసీ శిక్షణ నిర్వహించామన్నారు. క్యాంపుకు వెళ్లిన విద్యార్థులు సర్టిఫికెట్లు కూడా పొందారన్నారు. విద్యార్థుల డబ్బును భద్రపరిచామన్నారు. 19 మంది ఒకొక్కరు రూ.2,000 తీసుకొని మిగిలిన రూ.1,800లు పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛందంగా ఇచ్చార న్నారు.

16వ సారి పాదయాత్ర



పాదయాత్రగా శబరిమలకు వెళ్తున్న మాల ధారులు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఆదోని నుంచి శబరిమలకు 16వ సారి పాదయాత్రగా గురుస్వామి శ్రీనివాస్ ఆచారి ఆధ్వర్యంలో 15 మంది సోమవారం బయలు దేరారు. అనంతపురం, బెంగళూరు మీదుగా సేలం, డిండిగల్, తేని, కుంబ్లీ పులిమేడు నుంచి శబరిమలకు చేరుకుంటుందని తెలిపారు. పంపారెడ్డి, మల్లి, ప్రహ్లాద, రంగనాథ్ ఉన్నారు.



ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



విజేతలతో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కర్నూలు డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన భూషణ్‌రావు స్మారక బాస్కెట్‌బాల్ పోటీలు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై విజేతలకు ట్రోఫీ, నగదు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడవాలన్నారు. టోర్నమెంటులో పాల్గొన్న జట్లకు 3 రోజులు భోజన వసతి కల్పించిన మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, ఇండస్ విల్లాస్‌లకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు నగదు బహుమతులను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో నీలిమారెడ్డి, దాదాబాషా, లక్ష్మీనారాయణ, డాక్టర్ రజనికాంత్ పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీకి పోటీలకు ఆర్‌యూ జట్టు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న చెన్నైలోని ఎస్ఆర్ఎంలో జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ చాంపియన్ షిప్‌కు ఆర్‌యూ జట్టు పాల్గొననున్నట్లు కోఆర్డినేటర్ డా.శివకిషోర్ సోమవారం తెలిపారు. జట్టుకు ఆర్‌యూ వీసీ ఎన్టీకే నాయక్ క్రీడాదుస్తులు అందజేశారు. క్రీడా నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా తిరిగి రావాలని వీసీ కోరారు. రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, జట్టు మేనేజర్ మూర్తయ్య పాల్గొన్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర బృందం పర్యటన

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర బృందం మంగళవారం హంద్రీనీవా, పందికోన రిజర్వాయర్, ప్రధాన కాలువలపై పర్యటించనున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పందికోన రిజర్వాయర్ పనులను పూర్తి చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా పంట పొలాలకు నీరు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువలను వెడల్పు చేసే విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్ పర్యటనకు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యురేనియం తవ్వకాలు ఆపాలి

కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

కర్నూలు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల పరిసర ప్రాంతాల్లో యురేనియం తవ్వకాలు ఆపాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళన చేశారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, జిల్లా బులెడ్కల, పీ కోటకొండ తదితర గ్రామాలకు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను నమ్మించి నమూనాలు సేకరించారని వారు ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా తవ్వకాలు మొదలు పెట్టారని అన్నారు. అప్పట్లో ఏదో శాంపిల్స్ సేకరించి బోర్డు గ్రిల్స్ వేస్తున్నామని నమ్మించి ఇప్పుడు ఏకంగా తవ్వకాలు చేపట్టడం ఏమిటని నిలదీశారు. ఈ తవ్వకాలతో పచ్చని పంటలన్నీ నాశనం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 6.8 హెక్టార్లలో 68 గ్రిల్స్ వేసి యురేనియం తవ్వకాలు చేస్తున్నారని, వాటిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న రైతులు

రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని 52 వార్డులో అధిక వర్షాలతో దెబ్బతిన్న కాలువలు, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నగర కార్యవర్గసభ్యులు బీసన్న అధ్యక్షతన నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లా డుతూ సీపీఐ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా 16, 19, 20, 29, 37, 38 వార్డుల్లో రోడ్లు, కాలువలను పరిశీలించామన్నారు. కమిషనర్, కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నల్లన్న, అన్వర్, మల్లేష్ పాల్గొన్నారు.

● నగరంలోని సుందరయ్య పార్కులో సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. సుందరయ్య పార్కు నిర్మాణంతోపాటు శాంతి నగర్ కాలనీలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మల్లికార్జున, చంద్రనాయక్, శ్రీనివాసులు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఐడీఏ అధ్యక్షుడిగా మురళీధర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసి యేషన్ (ఐడీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మురళీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం ఒంగోలులో జరిగిన 43వ రాష్ట్ర సదస్సులో ఆయనను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నంద్యాల జిల్లాకు చెందిన డాక్టర్ కిషోర్, ఐడీఏ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి ఎంపికయ్యారు.



అభినందనలు తెలుపుతున్న సభ్యులు

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం

కర్నూలు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పోలీసు కార్యాల యంలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వ ర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్పీ బిందుమాధవ్ హాజరై ప్రారంభించారు. అనంతరం ఎస్పీ రక్తదానం చేశారు. రక్తదానం చేసిన పోలీసులను ఎస్పీ ఫ్రూట్‌జ్యూస్, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసరావు, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, బ్లడ్ బ్యాంకు కౌన్సిలర్ కిరణ్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

సందడి చేసిన 'రంగస్వామి' చిత్ర బృందం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో మౌర్యఇన్‌లోని భరత్ థియేటర్ వద్ద ఇటీవల విడుదలైన తెలుగు చిత్రం 'రంగస్వామి' చిత్ర యూనిట్ బృందం సందడి చేసింది. సోమవారం ఈ చిత్రం ప్రదర్శిస్తున్న భరత్ థియేటర్ వద్ద ఈ చిత్రంలోని నటీ నటులు కేక్ కట్ చేసి ప్రేక్షకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన నటుడు మారుతి సకారాం మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువకుడు నరసింహాచారి నిర్మాణ దర్శకత్వంలో తీసిన ఈ చిత్రం యువతకు సందేశాత్మకంగా నిలిచిందన్నారు. మరో నటుడు బైటింటి మీనాక్షి రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన స్థానిక కళాకారులకు అవకాశాలు ఇప్పుడిప్పుడే వస్తున్నాయని, ఈ చిత్రం ద్వారా వారు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం కలిగిందని చెప్పారు.



కేక్ కట్ చేస్తున్న 'రంగస్వామి' చిత్రం యూనిట్ బృందం

సాయినాథ్ నగర్‌లో భారీ చోరీ

కర్నూలు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయినాథ్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. యాపిలయ్య అనే వ్యక్తి ఇంట్లో సుమారు 25 తులాల బంగారు నగలు అపహరించారు. యాపిలయ్య దంపతులు డోన్ వెలుగు ఆఫీసులో పని చేస్తున్నారు. సోమవారం ఉదయం ఆఫీసుకు వెళ్లి రాత్రికి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపు తాళం తెరిచి ఉంది. బీరువాలో ఉన్న 25 తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ గోపినాథ్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. అలాగే సమీపంలోని మరో ఇంట్లో కూడా దొంగలు చోరీకి యత్నించారు.

ఉల్లి రైతుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉల్లి మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్‌ను అరికట్టాలని, రైతులకు క్వింటానికి రూ.3వేల నుంచి రూ.5వేలు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతి పత్రం అందించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావేదికలో జేసీని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రతినిధులు కలిసి ఉల్లి రైతుల సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎకరా ఉల్లి పంటను సాగు చేసేం దుకు రూ.లక్ష దాకా ఖర్చు పెడుతున్నారని, అయితే.. ధర మాత్రం ఎక్కడా రైతులకు గిట్టుబాటు కావడం లేదని, లైసెన్సు తీసుకున్న వ్యాపారులంతా వేలం పాటలో పాల్గొనడం లేదని, సిండికేట్‌గా మారి ధర తగ్గించడంతో పాటు ఒకటి, రెండు లాట్లు మాత్రమే ఎక్కువ ధరను నమోదు చేసుకుని మిగిలిన పంటనంతా తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని జేసీ దృష్టికి తెచ్చారు. సీసీ కెమెరాలను మార్కెట్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు శేఖర్, మహబూబ్ బాషా, నాగన్న పాల్గొన్నారు.



జేసీకి వినతి పత్రం ఇస్తున్న రామకృష్ణ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ కోరారు. సోమవారం గూడూరు నగర పంచాయతీ కార్యాయలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్ నాగరాజు, చైర్మన్ జె వెంకటే శ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జె మోహన్, మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి శాంతన్న మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు సూర్య శేఖర్, సువర్ణమ్మ, లక్ష్మీదేవి, గుంతన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులలో 50 శాతం రాయితీని అందించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.గోరంట్లప్ప, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు హుశేన్, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, నగర కార్యదర్శి శివకుమార్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సునీల్ కుమార్, నాయకులు బ్రహ్మయ్య, శివశంకర్, ఎర్రమల, దామోదర్, సుందర్‌రాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ్ అన్నారు. సోమవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో వచ్చేనెల 9న నిర్వహించే వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని వాలీబాల్, ఫుట్‌బాల్ తదిరత క్రీడా పోటీలు నిర్వహించారు. రిజిస్ట్రార్ క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పాల్ కృపాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

కోడుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ మంజుల హెచ్చరించారు. కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన బోయ ఉరుకుంద సోమవారం కోడుమూరులోని మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసుకొని మోటర్ బైక్‌పై చనుగొండ్లకు తీసుకెళ్తుంగా అతడిని వెంబడించి పట్టుకున్నామన్నారు. నిందితుడు నుంచి ఏపీకి చెందిన 24 క్వాటర్ సీసాలు, మోటర్ బైక్ స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ జయ లక్ష్మి, కానిస్టేబుల్ తిరుపాల్, నాగయ్య, చంద్ర మోహన్, సుజాత పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో మౌలిక సదుపా యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణ, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వర రెడ్డి, సత్యనారాయణ, శేషసాయి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కు మార్, ఆర్ఓ జునైద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

మాతృ శాఖలో విలీనం చేయాలి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్ నిలిపివేసి తమను మాతృ శాఖకు పంపాలని గ్రామ ఉద్యాన అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. సోమవారం ఉద్యానవన శాఖ జేడీ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. దేశస్థాయిలో ఉద్యాన పంటల సాగులో రైతులు గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నారని, ఇలాంటి శాఖలో పని చేస్తున్న కింది స్థాయి సిబ్బందికి మంచి జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యాన అధికారి పర్యవేక్షణలో తాము పని చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, గ్రామస్థాయిలో పని చేస్తున్న తమను పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌ఎంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండల పరిధిలోని పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై ఇద్దరు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ మీద వ్యక్తిగత కక్షలతో జీతాలు ఆపేశారని స్కూల్ అసిస్టెంట్లు నాగేంద్రుడు, బాకర్ సాహెబ్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జీతాలు చేయాలని డీఈవో చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రెండు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

సావిత్రీబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): నగరంలోని సావిత్రీబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా బీసీ సంఘం నాయకులు కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్య, ధనుంజయాచారి, బీసీ నాయకులు శ్రీనివాస్ నాయుడు, బత్తుల సంజీవరాయుడు పాల్గొన్నారు.

వాల్మీకి భవన్‌కు స్థలం కేటాయించండి

కర్నూలు నగర పరిసర ప్రాంతాల్లో వాల్మీకి భవన్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ వాల్మీకి సంఘం నాయ కులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. వాల్మీకి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణ నాయుడు, బేతం కృష్ణుడు, రమణ, శేఖర్, రవి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

సి.బెళగల్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సి.బెళగల్, పోలకల్లు, ముడుమాల గ్రామాల్లోని రైతులు తహసీల్దార్ శ్రీనివాస రెడ్డికి విన్నవించారు. సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మం జరిగింది. అనంతరం తహసీల్దార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సెక్యూరిటీ గార్డుల ఆందోళన

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డ్యూటీ నుంచి అకారణంగా తొలగించిన తమను విధుల్లో తీసుకోవాలని కోరుతూ సెక్యూరిటీ గార్డులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అంతకుముందు కర్నూలు జీజీహెచ్‌లోని ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ సెక్యూరిటీ ఆఫీసు ముందు సెక్యూరిటీ గార్డులు చంద్రబాబు, మద్దిలేటి, యోగేష్, సురేష్‌లు నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జీతం అడిగినందుకు ఏజెన్సీ వారు తమను ఉద్యోగాల నుంచి తొలగించారని ఆరోపించారు.

చార్జీలు పెంచిన తర్వాతే మెనూ అమలు చేయాలి

కల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో చార్జీలు పెంచిన తర్వాతే మెనూ అమలు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ నాయకుడు ఏసు ఆధ్వర్యంలో కల్లూరు ఎంఈఓ ఆఫీసు ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.సుధాకరప్ప, శ్రీరాములు, రమిజాబీ, జహారాబీ పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణతో ఏఈవోలకు అన్యాయం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధీకరణతో ఏఈవోలకు అన్యాయం జరుగుతుందని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్స్ ఆఫీసర్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, జిల్లా ట్రెజరర్ జయరామ్, ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. సోమవారం జేడీ వరలక్ష్మిని కలిసి వినతి పత్రం అందించారు.

వీకర్‌సెక్షన్ కాలనీలో కార్డెన్ సెర్చ్

కర్నూలు క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడు పోలీసు సిబ్బంది స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో డీఎస్పీ బాబుప్రసాద్‌తోపాటు ఆరుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 75 మంది పోలీసులు పాల్గొన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్టులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమానితుల ఇళ్లల్లో దాడులు చేశారు. అనంతరం కాలనీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. తనిఖీల్లో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 15 బైకులు స్వాధీనం చేసుకున్నారు.

తగ్గిన నీటి ప్రవాహం



మాధవరం వద్ద పూర్తిగా తగ్గిన తుంగభద్ర నది ప్రవాహం

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది ప్రవాహం తగ్గిపోయింది. సోమవారం సాయంత్రం మంత్రాలయం వద్ద 308.03 మీటర్ల నీటి మట్టంతో 12 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. టీబీ డ్యాం నుంచి 1.06 లక్షల క్యూసెక్కుల నీరు నదికి విడుదల చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం డ్యామ్ గేట్లను ఎత్తి 4,580 క్యూసెక్కుల నీరు నదికి వదిలారు. డ్యాంలోకి 11,367 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

భక్తులకు రాఘవరాయుడి నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలను బంద్ చేశారు. సోమవారం కార్తీక ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు స్తప్త ముద్రదారణ చేశారు. రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అన్నదానానికి విరాళం

మంత్రాలయం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన శోభ సంపత్ అనే భక్తురాలు రూ.లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని వారు దర్శించుకున్నారు. విరాళం ఇచ్చిన దాతకుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు స్వామివారి మెమెంటో, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు మాట్లాడుతూ 25సంవత్సరాల నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని అన్నారు. కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కౌతాళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ కౌతాళం గ్రామ నూతన కమిటీని సోమవారం ఆ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆనంద్ రాజు, మండల అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఎస్.ఆనంద్, ఉపాధ్యక్షుడిగా ఉలిగయ్య, ప్రధాన కార్యదర్శిగా రాము, కోశాధికారిగా పరుసు, ప్రచార కార్యదర్శిగా సురేష్‌తోపాటు మరో పదిమందిని సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

గుంతలమయం

- పల్లెల రహదారులు అధ్వానం
- ఎమ్మిగనూరు, కోడుమూరు రహదారిపై నిత్యం ప్రమాదాలు
- వారంలో రెండు, మూడు ఘటనలు

గోనెగండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లగా ఎమ్మిగనూరు, కోడుమూరు రహదారి గుంతలమయంగా మారింది. ప్రతి రోజు ఈ రహదారిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రిపూట వాహనదారులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. గత వారం బళ్లారికి చెందిన ఓ కుటుంబసభ్యులు కారులో కర్నూలుకు వెళ్తుండగా వేముగోడు గ్రామ సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోని దూసుకెళ్లింది. కారులో ఉన్న వారికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే రెండు నెలల క్రితం ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై మంత్రాలయానికి వెళ్లి తిరుగుప్రయాణంలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో మహిళ మృతి చెందింది. అలాగే పుట్టపాశం వేముగోడు గ్రామాల మధ్య ఉల్లిగడ్డల లారీ గుంతను తప్పించబోయి బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈలాంటి సంఘట నలు రోజూ జరుగుతూనే ఉన్నాయి. అలాగే పల్లెలకు వెళ్లే దారులు కూడా ప్రమాదకరంగా మారాయి. పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, పుట్టపాశం, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, అలువాల, కులుమాల, గోనెగండ్ల నుంచి ఐరన్‌బండ వెళ్లే రహదారి గంజహళ్లి, బైలుప్పల, అగ్రహా రం గ్రామాలకు వెళ్లేదారి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనచోదలకు, ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మిగనూరు- కోడుమూరు ప్రధాన రహదారిలో గుంతలు



పుట్టపాశం గ్రామం వద్ద గుంతలు పడ్డ రహదారి

ఆర్టీఐపై అవగాహన

కౌతాళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం-2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి అన్నారు. కౌతాళంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ-2005 సభ్యులతో కలిసి ఆర్టీఐ వ్యవసాయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శేషాద్రి మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టం ద్వారా సామాన్య ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి తీసుకోవచ్చని ఇది సామాన్య ప్రజలకు వజ్రాయుధంగా ఉపయోగపడుతుందని తెలిపారు. సమాచార హక్కును ఉల్లంఘిస్తే ప్రభుత్వ ఉద్యోగులు కూడా శిక్షార్హులు అవుతారని తెలిపారు.

మంత్రాలయం: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రకారం కావాల్సిన సమాచారం పొందడం అందరి హక్కు అని మండల వ్యవసాయాధికారి జీర గణేష్ అన్నారు. సోమవారం మంత్రాలయం వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీఈవో బసవరాజు, ప్రవీణ, సువర్ణమ్మ, మధుకర్, సునీత, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



షర్మిలతో పెద్దకడబూరు నాయకులు

పెద్దకడబూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మురళిదొర ఆధ్వర్యంలో పెద్దకడుబూరు కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనందరాజులతోపాటు మరి కొంతమంది నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలను సోమవారం కలిశారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి నియోజకవర్గ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పలు అంశాలపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకరావాలని కోరారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు యువకుడి ఎంపిక



బడేసావలి

గోనెగండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లకు చెందిన యువకుడు బడేసావలి సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో గోనెగండ్లలోని బడేసావలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. వారం రోజులుగా సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు వెళ్లే జట్టు ఎంపిక కోసం రాయలసీమ యూనివర్సిటీలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన బడేసావలిని చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరుగుతున్న సౌత్‌జోన్ కబడ్డీ చాంపియన్స్ పోటీలకు నిర్వహకులు ఎంపిక చేశారు. పోటీల్లో 115 యూనివర్సిటీల కబడ్డీ క్రీడా కారులు పాల్గొంటున్నారు. అయితే బడేసావలి ప్రస్తుతం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని శ్రీలక్ష్మి బీపీఈడీ ఏపీఈడీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామ స్థుల వివరాల మేరకు.. మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన బోయ లక్ష్మి(35) గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమ యంలో పాముకాటుకు గురైంది. గమనించి న కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త ఉరుకుందు, ఒక కుమా రుడు, ఒక కుమార్తె ఉన్నారు.

మహిళ అదృశ్యం

మంత్రాలయం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. సదరు మహిళ ఈనెల 23న రాత్రి నుంచి కనిపించకపోవడంతో తండ్రి బంధువుల వద్ద వెతికారు. కూతురు ఆచూకీ లభ్యం కాకపోవటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రభుత్వం బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పవన్ తేజ, రంగస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో కూలీలు బతుకు తెరువు కోసం వలసపోతున్నారని అన్నారు. అయితే వారి పిల్లలు గ్రామాలలో ఉండేందుకు వీలు కాక పోవడంతో తల్లిదండ్రుల వెంటనే వలసలు వెళ్తున్నారని తెలిపారు. దీంతో బడిలో హాజరుశాతం తగ్గిపోయిందన్నారు. అధికారులు స్పందించి హాస్టల్ ఏర్పాటు చేస్తే వలస వెళ్లేవారి పిల్లలు విద్యాభ్యాసం కొనసాగించేందుకు వీలు ఉంటుందన్నారు. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాసులు, వినయ్, రియాజ్, కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొటేకల్లు లక్ష్మన్న



చెన్నకేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న కొటేకల్లు జె.లక్ష్మన్న

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన జె.లక్ష్మన్నను వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుకల సహకారంతో తనను జిల్లా ఉపాధ్యక్షుడి వైసీపీ అధిష్టానం ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుకలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

కౌతాళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రము ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు, దేవాలయ స్థల పరిశీలనకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎండోమెంట్ డిప్యూటీ స్తపతి నాగేశ్వర నెహ్రా అన్నారు. సోమవారం ఆయన ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ్‌రాజు, ఆలయ సిబ్బందితో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్తపతి మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చేపట్టాల్సిన పనులను గురించి ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. అంతకు ముందు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరి వెంట ఆలయ సూపరిటెండెంట్లు వెంకటేశ్వరరావు, మల్లికార్జున, అధికారులు, అర్చక సిబ్బంది ఉన్నారు.



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రతి కార్యకర్త నిరంతరం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ 3వ పట్టణ మహాసభ తేరు బజారులోని పద్మశాలి కళ్యాణ మండపంలో సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శిగా గోవిందు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి

ఎమ్మిగనూరు టౌన్,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శేషాఫణికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రాము, వినోద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంబా భవాని ఆలయ స్థలం జోలికి రావద్దు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల రోడ్డులో ఉన్న అంబా భవాని ఆలయం స్థలం జోలికి రావద్దని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విఠల్‌రావు, కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ సర్వే నంబరు 321-1లో 12 సెంట్ల స్థలంలో 1905లో ఆలయము నిర్మించారన్నారు. రెండు సెంట్ల స్థలాన్ని ఆలయ ధూప నైవేద్యము, ఆలయ ఖర్చుల కోసం దుకాణాలు ఏర్పాటు చేసి బాడుగకు ఇచ్చారన్నారు. ఇప్పుడు మునిసిపల్ స్థలమని షాపింగ్ కాంప్లెక్స్ కట్టడానికి సంబంధిత అధికారులు యత్నిస్తున్నారని, దీనిని తాము ఒప్పుకోమన్నారు. ఆలయ స్థలం జోలికి వస్తే సహించేది లేదన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతల పర్యవేక్షణలో ముందుంటారన్నారు. విధి నిర్వ హణలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ బాలాజి, కానిస్టేబుల్స్ వెంకటేష్, బసప్ప, శేషారెడ్డి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదుపై అవగాహన : టీడీపీ

నందవరం, అక్టోబరు 28(ఆంధజ్యోతి): టీడీపీ సభ్యత నమోదుపై అన్ని గ్రామాల బూత్ కన్వీనర్లకు, నాయకులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి క్లస్టర్ ఇన్‌చార్జి కాశీంవలి సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నకొత్తిలి పత్యారెడ్డి, నదిచైరవాడి వీరేష్ రామకృష్ణారెడ్డి, ఆదిశేషు, కనకవీడు డబ్బా ఈరన్న పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

గోనెగండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీపేట, పెద్దమరివీడు రోడ్డు, కిందిగేరిలో దాదాపు 36 గోవులు, ఎద్దులు, బర్రెలను కత్తితో పొడిచి గాయాలు చేసిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం, శనివారం రెండు రోజులు గ్రామంలో రాత్రిపూట తిరుగుతూ ఆరు బైట కట్టివేసిన మూగజీవాలను కత్తితో పొడిచి తీవ్రరక్తగాయాలు చేసిన ఉన్మాదిపై పశువులు యజమానులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దాంతో రెండు రోజుల పాటు గ్రామంలో విచారించి గోనెగండ్ల గ్రామానికి చెందిన బండమీద మదీనా అనే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెద్దకడబూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోనే ఆధార్ సవరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ నాయకులు ప్రశాంత్, భూపాల్, శివకుమార్ కోరారు. సోమవారం పెద్దకడుబూరులోని తహసీల్దార్ శ్రీనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు ఆపార్ ఐడీ క్రియేట్ చేసే సమయంలో విద్యార్థుల ఆధార్ కార్డుల్లో తప్పులు ఉండడంతో ఐడీ క్రియేట్ కావడంలేదన్నారు. దీంతో ఆధార్‌లోని తప్పులను సరిచేసేందుకు పాఠశాలల్లోనే ఆధార్ సవరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కౌతాళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో 'లోపించిన పారిశుధ్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు సోమవారం గ్రామంలోని పాత బస్టాండ్, రాఘవేంద్రస్వామి దేవాలయ వీధుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేయించారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఎంపీడీవో సుబ్బరాజు, సర్పంచ్ పాల్‌దినకరన్ పాల్గొన్నారు.

